TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 సంచిక: 23 | 16-6-2025 సోమవారం | పేజీలు : 4 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, M Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagir

## నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్



ఖమ్మం :(సందేశం టైమ్స్, జూన్ 15) : జూన్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవుతుందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం క్యాబినెట్ సమావేశం అనంతరం ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత ఇస్తామని అన్నారు. తొలుత ఎంపిటిసి, జెడ్పీటిసి, తర్వాత సర్పంచ్, మునిసిపాలిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే ఉందని, పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని మంత్రి సూచించారు. వారం రోజుల్లో 'రైతు భరోసా', సన్నాలకు బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు.

## బాసరలో విషాదం..

# గోదావరి స్నానానికి వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

(సందేశం టైమ్స్, జూన్ 15) : నిర్మల్ జిల్లా బాసరలో తీవ్ర విషాదం నెలకొంది. గోదావరిలో స్నానానికి వెళ్లి ఐదుగురు మృత్యువాత పడ్డారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం.

వివరాల్లోకి వెళ్తే.. వీకెండ్ కావడంతో హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన ఓ కుటుంబం గోదావరిలో పుణ్యస్నానాలకు బాసరకు వచ్చింది. దాదాపు18 మంది కుటుంబసభ్యులు బాసరకు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గోదావరిలో తేలిన ఇసుక మెటల వద్దకు చేరుకు స్నానాలు చేస్తుండగా ఐదుగురు యువకులు గోదావరి నదిలో మునిగి గల్లంతయ్యారు. ఇది గమనించి కుటుంబసభ్యులు, స్థానికులు సమాచారం అందించడంతో సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీశారు.అనంతరం మృతదేహాలను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతులను రాకేశ్, వినోద్, మదన్, రుతిక్‌గా గుర్తించారు.



## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్,



మణికొండ, (సందేశం టైమ్స్, జూన్ 15) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం (5కే రన్), వన మహోత్సవ కార్యక్రమాన్ని నార్సింగి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గండిపేటలోని మెలుహ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని వారు మొక్కలు నాటి అనంతరం ఐదు కిలోమీటర్ల పరుగును జెండా ఊపి ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి ప్రారంభించారు. అనంతరం 5%ఖ =బఅ% లో పాల్గొన్న ప్రతిభావంతులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 100 రోజుల ప్రణాళికతో ప్రజా సమస్యలను గుర్తిస్తూ ప్రజలకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి 5%ఖ% రన్ తో పాటు ప్రజా అవసరాలను గుర్తించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులు ఎప్పటికప్పుడు చర్చించి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాలలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.

## కాంగ్రెస్‌వి బూటకపు మాటలు.. మండిపడ్డ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



(సందేశం టైమ్స్, జూన్ 15) : కాంగ్రెస్ నాయకుల మాటలు బూటకమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతున్నామని తెలిపారు. బీసీల విషయంలో కాంగ్రెస్ నయవంచన చేసిందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ఇక చెత్తబుట్టలో పారేయాల్సిందేనని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కులగణన ఏదో గొప్పగా చేశామని ఇది దేశానికి రోల్ మోడల్ అని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్ళు ఎన్నికల్లో చెప్పిందేమిటి ?చేసిందేమిటి అని ఆయన ప్రశ్నించారు. కులగణన తప్పుల తడకగా చేశారని .. అరవై శాతం జనాభా ఉన్న బీసీలకు మూడేనా మంత్రి పదవులు అని నిలదీశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మంత్రివర్గ కూర్పులో ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్దత ఏదీ ? కీలక శాఖలు బీసీల దగ్గర ఎందుకు లేవు? ఏడాదికి రూ.20వేల కోట్లు బీసీ లకు బడ్జెట్ లో పెడతామని చెప్పి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఏ మొహం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని మండిపడ్డారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఏమిటి ? 42 శాతం సీట్లు బీసీలు ఎలాగైనా గెలుస్తారు.. మీరు ఇచ్చేది ఏమిటి అని నిలదీశారు.

కేంద్రానికి బీసీ బిల్లును పంపించి చేతులు దులుపుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసినపుడు బీసీ బిల్లు చట్టబద్ధత గురించి ఎందుకు చర్చించ లేదని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీలోని అన్ని కులాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. ఇంకా ఎన్నాళ్లు బీసీలను మోసం చేస్తారని మండిపడ్డారు. ఏదో రైతుబంధు డబ్బులు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టెక్కాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వచ్చే ఎన్నికల దాకా ఏ హామీలను పట్టించుకోరని తెలిపారు. రెండుసార్లు మోసపోయిన ప్రజలు.. ఇకపై మోసపోవడానికి సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో కులవృత్తుల బతుకులు ఆగమయ్యాయని అన్నారు. బీసీలు అప్రమత్తంగా లేకపోతే కాంగ్రెస్ ఆగడాలకు అంతే ఉండదని పేర్కొన్నారు. దీనిపై బీసీ సంఘాలు కూడా స్పందించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు . కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తే బీసీలు కాంగ్రెస్‌కు రెడ్ కార్పెట్ పరుస్తారని చెప్పారు.అందాల పోటీలతో డబ్బులు వృథా చేశారని.. అదే ఫార్ములా ఈ రేసింగ్‌లో ఎలాంటి అవినీతి జరగకున్నా కానీ కేటీఆర్‌ను విచారణ పేరుతో వేధిస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నోటీసులకు భయపడమని స్పష్టం చేవారు. అన్ని పార్టీల్లోని బీసీలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని కోరారు.

## ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా గిరిజన బిడ్డ సరిత



సంస్థాన్ నారాయణపురం:(సందేశం టైమ్స్, జూన్ 15) : ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్యతండాకు చెందిన సరిత రికార్డు సృష్టించారు. విధుల్లో చేరిన ఆమె.. మొదటిరోజు హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు బస్ నడిపారు.

## డిసిసిబి డైరెక్టర్ హరీష్ కుమార్ కిడ్నాప్..

**అర్ధరాత్రి రెండు గంటలకు ఇంటి నుంచి కిడ్నాప్**

**మూడు కోట్లు డిమాండ్ ..**

**తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద తప్పించుకున్న హరీష్ కుమార్**



## 20న ఎపి తెలంగాణ బంద్.. పిలుపు ఇచ్చిన మావోయిస్ట్ లు

హైదరాబాద్:(సందేశం టైమ్స్, జూన్ 15) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ను నిరసిస్తూ.. ఈ నెల 20న ఏపీ తెలంగాణ రాష్ట్రాల బంద్ కు మావోయిస్టు నేతలు పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాల బంద్‌కు ప్రజలు సహకారం అందించి విజయవంతం చేయాలని కోరుతూ.. మావోయిస్టు నేత జగన్ పేరుతో ఓ లేఖను విడుదల చేశారు. కాగా మావోయిస్టు నేతలు బంద్‌కు పిలుపునివ్వడంతో అప్రమత్తమైన బలగాలు.. ఏఓబీ, తెలంగాణ–ఛత్తీస్గఢ్ సరిహద్దులతో పాటు అటవీ, ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతను ముమ్మరం చేశారు. ఇరువైపుల వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.



# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా.. ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ



(సందేశం టైమ్స్, జూన్ 15): తెలంగాణ రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. గోదావరి –బనకచర్ల లింక్ ప్రాజెక్టు ప్రాథమిక నివేదికకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలవడాన్ని వ్యతిరేకించినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం ఏదైనా కొత్త ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు గోదావరి / కృష్ణా బోర్డుల అనుమతి, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు గాని, బోర్డులకు గాని సమాచారం అందించకుండానే ఏకపక్షంగా విభజన చట్టాన్ని ఉల్లంఘించి ప్రాజెక్టును నిర్మించడానికి ముందుకు సాగుతున్నదని.. త్వరలోనే ప్రాజెక్టుకు టెండర్లు పిలువనున్నట్లు తెలుస్తున్నదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభజన చట్టం 2014 ను ఉల్లంఘిస్తున్న కారణంగా ఈ అంశాన్ని చర్చించడానికి తక్షణమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయమని కేంద్ర జల్ శక్తి మంత్రిని కోరాలని విజ్ఞప్తి చేశారు. ఇది రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి బేషజాలకు పోకుండా, రాజకీయాలకు తావు లేకుండా వీలైనంత త్వరలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, లేదా ప్రత్యేక శాసన సభా సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ అంశంపై ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పైన పేర్కొన్న అంశాలపై మీరు శ్రద్ధ పెట్టి తగిన చర్యలు చేపడతారని ఆశిస్తున్నానని చెప్పారు. రాజకీయాలకు తావు లేకుండా ఈ కృషిలో బీఆర్ఎస్ మీకు తోడుగా నిలబడుతుందని స్పష్టం చేశారు.

ఉత్తమ్‌కు హరీశ్‌రావు రాసిన లేఖ యథాతథంగా..

నమస్కారం

తెలంగాణ రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రిగా పని చేస్తున్న మీకు కేంద్ర ప్రభుత్వం ద్వారా, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ద్వారా తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగానికి సాధించవలసిన కొన్ని అంశాలను మీ దృష్టికి తీసుకురావాలని తలచి ఈ లేఖ రాస్తున్నాను.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును సుమారు 80 వేల కోట్ల రూపాయలతో చేపట్టి 200 టీఎంసీల గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు వయా కృష్ణా బేసిన్ తరలించాలని తలపోసిన సంగతి, ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు సమకూర్చే విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రెండు లేఖలు కూడా రాసిన సంగతి మీకు తెలిసే ఉంటుందని ఆశిస్తున్నాను. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి – బనకచర్ల లింకు ప్రాజెక్ట్ ప్రాథమిక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్టుగా, కేంద్రం ఆ నివేదికను తెలంగాణ సహా అన్ని గోదావరి పరీవాహక రాష్ట్రాలకు వారి అభిప్రాయాల కోసం పంపినట్టుగా తెలుస్తున్నది.

ప్రాజెక్టు ప్రాథమిక నివేదికలో పొందుపరచిన వివరాల ప్రకారం 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్‌కు తరలించడానికి ప్రాజెక్టును మూడు సెగమెంట్స్‌గా విభజించారు.

1. పోలవరం జలాశయం నుంచి ప్రకాశం బ్యారేజీకి
2. ప్రకాశం బ్యారేజి నుంచి 150 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన బొల్లపల్లి కృత్రిమ జలాశయానికి
3. బొల్లపల్లి జలాశయం నుంచి బనకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్‌కు

ప్రాజెక్టు ప్రాథమిక నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించమని కోరడాన్ని మీరు 13.6.25 న కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు రాసిన లేఖలో తీవ్రంగా వ్యతిరేకించినందుకు, ప్రాజెక్టు పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొనసాగించకుండా నిరోధించాలని కోరినందుకు అభినందనలు తెలియజేస్తున్నాను.గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టు వల్ల గోదావరి నదీ జలాల్లో తెలంగాణ నీటి హక్కులకు భంగం వాటిల్లనుందని సాగునీటి రంగ నిపుణులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం ఏదైనా కొత్త ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు గోదావరి / కృష్ణా బోర్డుల అనుమతి, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు గాని, బోర్డులకు గాని సమాచారం అందించకుండానే ఏకపక్షంగా విభజన చట్టాన్ని ఉల్లంఘించి ప్రాజెక్టును నిర్మించడానికి ముందుకు సాగుతున్నది. త్వరలోనే ప్రాజెక్టుకు టెండర్లు పిలువనున్నట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభజన చట్టం 2014 ను ఉల్లంఘిస్తున్న కారణంగా ఈ అంశాన్ని చర్చించడానికి తక్షణమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయమని కేంద్ర జల్ శక్తి మంత్రిని కోరాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి బేషజాలకు పోకుండా, రాజకీయాలకు తావు లేకుండా వీలైనంత త్వరలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, లేదా ప్రత్యేక శాసన సభా సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ అంశంపై ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని కూడా కోరుతున్నాను.గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా గోదావరి జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 1480 టీఎంసీల నీరు లభ్యం అవుతుందని ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి శాఖ ఇంజనీర్లు లెక్క గట్టినారు. అందులో తెలంగాణ ప్రాజెక్టులకు 969 టీఎంసీలు ఉమ్మడి రాష్ట్రంలోనే వివిధ జీవోల ద్వారా తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించబడినాయి. ప్రాజెక్టులకు నీటి కేటాయింపులైతే ఉన్నాయి కానీ ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మాణం కాకపోవడం వలన, కొన్ని ప్రాజెక్టులు పాక్షికంగా నిర్మాణమైనందున వాస్తవ వినియోగం 200 టీఎంసీలకు మించలేదన్నది వాస్తవం. తెలంగాణ రాష్ట్ర సాధనా ఉద్యమానికి సాగునీటి ఆకాంక్షలే ప్రధాన చోదక శక్తిగా ఉన్నాయని మీకు తెలియనిది కాదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో గోదావరి జలాలను సంపూర్ణంగా వినియోగించుకునే లక్ష్యంతో గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రభుత్వం అనేక భారీ ప్రాజెక్టులను చేపట్టింది. గోదావరి నదిపై సదర్ మాట్, సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ బ్యారేజిలను, పెన్‌గంగ నదిపై చనాక కోరాట బ్యారేజీని నిర్మించింది. కాళేశ్వరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్ ను పూర్తి చేసి శ్రీరాంసాగర్, నిజాంసాగర్, వరదకాలువ, చెరువుల కింద 19 లక్షల ఎకరాలను స్థిరీకరించినాము. కొత్తగా ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందించినాము.శ్రీరాంసాగర్ రెండో దశ, దేవాదుల, మిడ్ మానేరు, కొమురం భీం, నీల్వాయి, గొల్లవాగు, రాలివాగు, మత్తడివాగు, సింగూరు కాలువ, కిన్నెరసాని కాలువ, పాలెంవాగు తదితర పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసింది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, ఘన్‌పూర్ ఆనకట్ట, స్వర్ణ, సాత్నాలా, శనిగరం, చెలిమెలవాగు ప్రాజెక్టుల కాలువల ఆధునీకీకరణ పూర్తి చేసి పూర్తి స్థాయి ఆయకట్టును సాధించింది. గోదావరి బేసిన్‌లో మిషన్ కాకతీయ ద్వారా తెలంగాణలో వ్యవసాయానికి అనాధిగా ప్రాణాధారంగా ఉన్న వేలాది చెరువులను పునరుద్ధరించింది. గోదావరి బేసిన్‌లో భూగర్భజలాలను పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం మంజీరా, మానేరు, కడెం, స్వర్ణ, హల్దీవాగు, కూడేల్లివాగు, పెద్దవాగు తదితర నదులు, వాగులపై కొత్తగా సుమారు 730 చెక్ డ్యాంలను నిర్మించింది. చెరువులను, చెక్ డ్యాంలను ప్రాజెక్టులతో అనుసంధానం చేసింది. ఎండాకాలంలో కూడా చెరువులు, చెక్ డ్యాంలలో నిండుగా నీటిని సరఫరా చేసింది. ఈ చర్యల ద్వారా గోదావరి జలాల వినియోగం గణనీయంగా 600 టీఎంసీలకు పెరిగింది. గోదావరి జలాల పూర్తి స్థాయి వినియోగానికి చేయవలసినది ఎంతో ఉంది. ముఖ్యంగా కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల కాలువల తవ్వకం పూర్తి చేసి గోదావరి నీటిని సంపూర్ణంగా వినియోగంలోకి తీసుకురావలసి ఉన్నది.

## డిసిసిబి డైరెక్టర్ హరీష్ కుమార్ కిడ్నాప్..

మామడ. (సందేశం టైమ్స్, జూన్ 15) : నిర్మల్ జిల్లా మామడ మాజీ ఎంపీపీ ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్, టిఆర్ఎస్ నాయకుడు చిక్యాల హరీష్ కుమార్ ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో మామడ మండలం పొనకల్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఆయన నివాసంలో నుంచి నిద్రలేపి వాహనంలో గుర్తుతెలియని దుండగులు కిడ్నాప్ చేసినట్లు చెబుతున్నారు. మూడు కోట్ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆగంతకులు కారులో హైదరాబాద్ వైపు తరలించారు. అదే సమయంలో హరీష్ కుమార్ తన సన్నిహితులకు ఫోన్ చేసి కొంత నగదు కావాలని కోరినట్లు కూడా చెబుతున్నారు. కిడ్నాప్ లో భాగంగా హైదరాబాద్ వైపు వెళుతున్న కారు తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద ఆగిన సమయంలో చాకచక్యంగా హరీష్ కుమార్ కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకున్నారు.

అక్కడినుండి నేరుగా తూప్రాన్ పోలీస్ స్టేషన్ వెళ్లి జరిగిన సంఘటన గురించి అక్కడి పోలీసులకు వివరించారు. తూప్రాన్ పోలీసులు మామడ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. హరీష్ కుమార్ తెలిసిన వ్యక్తులే ఈ కిడ్నాప్ చేసినట్లు జిల్లాలో ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం ఆయన సేఫ్ గా ఉన్నారు. తమకు సమాచారం ఉందని విచారణ జరుపుతున్నామని వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని మామడ ఎస్సై అశోక్ తెలిపారు.

కాగా ఈ ఘటన నిర్మల్ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతున్నది. కిడ్నాప్ జరిగిన మాట నిజమేనని తాను ప్రస్తుతం సేఫ్ గా ఉన్నానని ఎవరు ఆందోళన చెందే అవసరం లేదని హరీష్ కుమార్ తమ సన్నిహితులకు ఫోన్ చేసి చెప్పారు

## కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు



చేర్యాల, (సందేశం టైమ్స్, జూన్ 15) : కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలో ఆదివారం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారిని సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మరికొందరు భక్తులు స్వామి వారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.అలాగే కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షణలు,కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఈవో అన్నపూర్ణ, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలందించారు.

## ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా గిరిజన బిడ్డ సరిత

ఇన్నిరోజులు ఢిల్లీలో డ్రైవర్‌గా విధులు నిర్వహించిన సరిత ప్రత్యేక అనుమతితో తెలంగాణ ఆర్టీసీలో చేరారు.సీత్యతండాకు చెందిన వాంకుడోతు సరిత..రాంకోటి, రుక్కా దంపతుల ఆరుగురు సంతానంలో ఐదో అమ్మాయి. నలుగురు అక్కల పెండ్లి కోసం తన తండ్రి ఉన్న మూడెకరాల భూమిని అమ్మేయడంలో కుటుంబ పోషణ భారమైంది. దీంతో అక్క దగ్గర ఉంటూ నల్లగొండ జిల్లా దేవరకొండలో 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివింది. అక్కడ నుంచి 10వ తగతి వరకు ఓపెన్ స్కూల్‌లో విద్యను అభ్యసించారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో కుటుంబ బాధ్యత తీసుకున్నారు. ఈ క్రమంలో ఆటో నడటం నేర్చుకున్నారు. ఐదేండ్లు సంస్థాన్ నారాయణపురం నుంచి సీత్యతండా వరకు ఆటో నడిపారు. అనంతరం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉంటూ బస్సు డ్రైవింగ్ నేర్చుకుని హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నారు.2010లో నల్లగొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలవడంతో దరఖాస్తు చేశారు. అయితే అధికారులు మహిళలను డ్రైవర్లుగా తీసుకోలేమని ఆమె దరఖాస్తును తిరస్కరించారు. ఈ క్రమంలో ఆజాద్ ఫౌండేషన్ సహకారంతో ఢిల్లీకి వెళ్లిన సరిత.. కొన్నాళ్లపాటు కారు నడిపారు. రెండేండ్ల తర్వాత ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో 15 మంది మహిళా డ్రైవర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. అందులో సరిత ఒక్కతే ఎంపికయ్యారు. దీంతో దేశంలో మొదటి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు పొందారు. ఢిల్లీలోని సరోజినీ డిపోలో ఉద్యోగం చూస్తూ రోజూ 185 కిలోమీటర్ల దూరం బస్సు నడిపారు. ఆమె సేవలకు గుర్తింపుగా 2018లో నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రత్యేక పురస్కారం, కిరణ్ బేడీ వంటి ప్రముఖుల చేతుల మీదుగా 'ఉమెన్ అచీవర్స్' అవార్డును అందుకున్నారు.అయితే, ఢిల్లీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉండటం, ఖర్చులు ఎక్కువగా ఉండటంతోపాటు తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో వారిని చూసుకోవడానికి రాష్ట్రంలో బస్ డ్రైవర్‌గా అవకాశం ఇవ్వాలని గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. వారు స్పందించి ఆర్టీసీ డ్రైవర్‌గా ఆమెకు అవకాశం కల్పించారు. దీంతో హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు బస్సును నడిపి ఆర్టీలో తొలి మహిళా డ్రైవర్‌గా నిలిచారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ చ్రి రమేష్ బాబు



నెల్లికుదురు (సందేశం టైమ్స్, జూన్ 15) : ప్రభుత్వ పథకాలకు అప్లై అంటూ సైబర్ నేరగాండ్లు పంపించే లింకులను నమ్మి క్లిక్ చేయవద్దని నెల్లికుదురు ఎస్ఐ చిర్ర రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకాల పేరిట సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఎం కిసాన్, ముద్ర లోన్స్ వంటి పేర్లతో సైబర్ నేరగాళ్లు వలవేస్తున్నారని గుర్తు చేశారు.

కేవలం అధికారిక సైట్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. వాట్సాప్, ఎస్ఎంఎస్ లలో వచ్చే లింకులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పెట్టుబడుల కోసం సోషల్ మీడియాను నమ్మవద్దని, రోజుల్లో డబ్బులు రెట్టింపు అవుతాయంటే కచ్చితంగా అది అబద్ధమేనని, అపరిచితుల మాటలు నమ్మి ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోవద్దని హెచ్చరించారు.

# ఆర్థిక సంఘం నిధులివ్వాలి సర్పంచ్‌ల డిమాండ్




(సందేశం టైమ్స్ జూన్ 15) : గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కటకటలాడు తున్నాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రెండో విడత కింద సుమారు రూ.1,121 కోట్లను కేంద్రం 5 నెలల కిందటే రాష్ట్రానికి విడుదల చేసింది. ప్రభుత్వం వాటిని పంచాయతీలకు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా నిలిచిపోయాయని, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కూటమి సర్కారు రాకతో పంచాయతీలకు మహర్దశ పట్టిందని భావిస్తున్న తరుణంలో నిధుల విడుదలలో తాత్సారంపై విమర్శలొస్తు న్నాయి. పంచాయతీలకు సత్వరమే నిధులు విడుదల చేయాలని కోరుతూ అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు ఇటీవల పాడేరు ఐటీడీఏ పరిధిలో ధర్నాలు నిర్వహించారు. నిధులు లేక పంచాయతీలు ఇబ్బందులు పడుతున్నాయంటూ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత్ పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు ఇప్పటికే పలుమార్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమా ర్, కమిషనర్ కృష్ణతేజను కలిసి విన్నవించారు. శుక్రవారం కమిషనరేట్‌లో కృష్ణతేజను జాస్తి వీరాంజనేయులు కలిసి 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

# లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు: టీటీడీ





తిరుమల, (సందేశం టైమ్స్ జూన్ 15) : శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది. లడ్డూ ప్రసాదంపై తెలంగాణకు చెందిన భక్తుడు చేసిన ఆరోపణలు అసత్యమని ఓ ప్రకటనలో స్పష్టంచేసింది. 'జూన్ 8న శ్రీవారి లడ్డూప్రసాదం తినేటప్పుడు నోట్లో గాయమైందని రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ ఆరోపించారు. వైద్య పరీక్షల్లో నాలుక కొరుక్కోవడంతో గాయమైనట్లు తేలింది. టీటీడీ నుంచి నష్టపరిహారం పొందాలనే దురుద్దేశంతో లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియాలో అతను చేసిన అసత్య ఆరోపణలన్నీ ఖండిస్తున్నాం' అని టీటీడీ పేర్కొంది.

# త్రిశంకుస్వర్గంలో భాషోపాధ్యాయులు

- వైసీపీ హయాంలో కేడర్ రద్దుతో ఇబ్బందులు
- అప్పటి నుంచీ డీఈవో పూల్‌లో కొనసాగింపు
- ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు పంపుతున్న విద్యా శాఖ
- ఆరేళ్లలో నాలుగుసార్లు బదిలీ
- తాజాగా ఏజెన్సీ మండలాల్లో పోస్టింగ్
- జడ్పీ ప్రాంగణంలో ఆందోళన



(సందేశం టైమ్స్ జూన్ 15) : వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు అత్యుత్సాహంతో భాషోపాధ్యాయ (లాంగ్వేజ్ పండిట్లు) కేడర్‌ను రద్దు చేయడంతో వారంతా ఆరేళ్ల నుంచి త్రిశంకుస్వర్గంలో ఉండిపోయారు. ప్రస్తుతం మిగులు ఉపాధ్యాయులుగా డీఈవో పూల్‌లో ఉన్న వారిని విద్యా శాఖ ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు పంపిస్తోంది. ఏదైనా ఒక పాఠశాలలో టీచర్ దీర్ఘకాలిక సెలవుపై లేదా పదోన్నతిపై వెళ్లిపోతే ఆ స్థానంలో తాత్కాలికంగా పనిచేయాలని ఆదేశాలు ఇస్తోంది. 2008లో మెగా డీఎస్సీ ద్వారా తెలుగు, హిందీ, ఒరియా, ఉర్దూ, కన్నడ, తమిళం, సంస్కృత భాషల కోసం ఎంపికైన భాషోపాధ్యాయుల్లో కొందరికి తరువాత గ్రేడ్-1 పండిట్లుగా పదోన్నతి లభించింది. అయితే 2019 నవంబరులో వైసీపీ ప్రభుత్వం జీవో నంబరు 77 ద్వారా భాషోపాధ్యాయ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పదోన్నతి లభించని 66 మంది డీఈవో పూల్‌లోకి వెళ్లిపోయారు. కేడర్ రద్దు చేసినప్పుడు ఆ పోస్టుల్లో ఉన్నవారందరికీ పదోన్నతి కల్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో గడచిన ఆరేళ్లలో భాషోపాధ్యాయులు నాలుగు సార్లు బదిలీలకు గురయ్యారు. నిబంధనల మేరకు ఒక టీచర్ ఒకే స్కూలులో ఎనిమిదేళ్లు పనిచేయవచ్చు. దానికి భిన్నంగా పండిట్లను ఎప్పుడు పడితే అప్పుడు బదిలీ చేయడం పరిపాటిగా మారింది. ఇటువంటి పరిస్థితులతో విసుగుచెందిన భాషోపాధ్యాయులు తమకు న్యాయం చేయాలంటూ 2024లో కోర్టును ఆశ్రయించారు. అర్హతల మేరకు మూడు నెలల్లో పదోన్నతులు కల్పించాలని కోర్టు ఆదేశించినా ఖాళీలు లేవని విద్యా శాఖ వాయిదా వేస్తూ వచ్చింది. ఈలోగా సీనియారిటీ మేరకు భాషోపాధ్యాయులుగా తమకు కూడా పదోన్నతులు కల్పించాలని ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించారు. దీంతో యథాస్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశించింది. భాషోపాధ్యాయుల బదిలీల కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చినా ఎవరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేదు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో డీఈవో పూల్‌లో ఉన్న 66 మంది భాషోపాధ్యాయులలో 48 మందిని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెంకొత్తవీధి, పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి మండలాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో పోస్టింగ్ ఇస్తామని, మిగిలిన 18 మందిని క్లస్టర్ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం జడ్పీ ప్రాంగణంలో టీచర్ల కౌన్సెలింగ్ జరుగుతున్న హాలు ముందు భాషోపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్లు మాట్లాడుతూ 66 మందిలో 50 మంది వరకూ మహిళలే ఉన్నారని, ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. తమను మైదాన ప్రాంతంలో ఏ మూలైనా యూపీ పాఠశాలలకు పంపాలని డిమాండ్ చేశారు. వారి తరపున ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు వెంకటపతిరాజు, గోపినాథ్, తదితరులు విశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్, అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడుతో చర్చలు జరిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తిచేశారు.

# నేటితరం సివిల్ సర్వెంట్లకు గోపాలకృష్ణ ఆదర్శం



న్యూఢిల్లీ, (సందేశం టైమ్స్ జూన్ 15) : విశ్రాంత ఐఏఎస్ ఎం.గోపాలకృష్ణ నేటి తరం సివిల్ సర్వెంట్లకు ఆదర్శమని ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ అన్నారు. ఇక్కడ ఏపీ భవన్ ఆడిటోరియంలో గోపాలకృష్ణ రాసిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ... '86 ఏళ్ల వయస్సులోనూ గోపాలకృష్ణ సమాజహితం కోరుతూ రోజుకు 12 గంటలు కష్టపడుతున్నారు. ఉమ్మడి ఏపీలో విధులు నిర్వర్తించి విప్లవాత్మక కార్యక్రమాలు ప్రవేశపెట్టారు. గోదావరి ఫెర్టిలైజర్స్‌ను బలోపేతం చేయడంతో పాటు, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను లాభాల బాటలో నడిపించారు' అని తెలిపారు.


# నైరుతి కదలికలో స్వల్ప జాప్యం



విశాఖపట్నం,(సందేశం టైమ్స్ జూన్ 15) : నైరుతి రుతుపవనాల కదలికలో స్వల్ప జాప్యం నెలకొంది. రానున్న మూడు రోజుల్లో విదర్భ,ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని బులెటిన్‌లో పేర్కొంది. ఆ తర్వాత మూడు రోజుల్లో గుజరాత్, పశ్చిమ బెంగాల్, జార?ండ్, బిహార్‌లో పలు ప్రాంతాలకు విస్తరించనున్నాయని పేర్కొంది. శుక్రవారం తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. కర్ణాటక నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశా వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. శని, ఆదివారాల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించాయి.

# మన్యంలో బార్బడోస్ చెర్రీ

- ఉద్యాన పరిశోధన స్థానంలో బార్బడోస్ చెర్రీ చెట్లు
- ఉద్యాన పరిశోధన స్థానంలో విరగ్గాసిన చెట్లు
- పండ్ల రుచి చూసేందుకు స్థానికులు ఆసక్తి
- గిరిజన ప్రాంతంలో సాగుకు అనుకూలం




చింతపల్లి,(సందేశం టైమ్స్ జూన్ 15) : ఉద్యాన పరిశోధన స్థానంలో బార్బడోస్ చెర్రీ చెట్లు విరగ్గాశాయి. అరుదైన చెర్రీ కావడంతో ఈ పండ్లను రుచి చూసేందుకు స్థానికులు క్యూ కడుతున్నారు. స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో సుమారు పదేళ్ల క్రితం మొక్కలు వేయగా.. ఇప్పుడు చెట్లుగా ఎదిగాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో పండ్ల దిగుబడి వస్తున్నది. ఆకర్షణీయంగా చిన్నపాటి యాపిల్స్ మాదిరిగా ఉండే ఈ పండ్లు చూసే వాకి నోరూరిస్తున్నాయి. ఈ పండ్లు పులుపు, తీపి కలగలిపిన రుచి ఉండడంతో తినేందుకు స్థానికులు, సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు.బార్బడోస్ చెర్రీలను వెస్ట్ ఇండియా చెర్రీ, అసిరోలా అని పిలుస్తారు. అరుదుగా లభించే బార్బడోస్ చెర్రీ మొక్కలు గిరిజన ప్రాంతంలో బాగా పెరుగుతున్నాయి, పండ్ల దిగుబడి అధికంగా ఉంటుంది. ఈ మొక్కలను పరిశోధన స్థానంలో 12ఏళ్లగా సాగు చేస్తున్నారు. ఈ పండ్లలో పోషక విలువలు పుష్కలంగా వుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బార్బడోస్ చెర్రీలకు ఉత్తర భారత దేశంలో, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. విశాఖపట్నంలో మార్కెట్‌లో కిలో రూ.240కి విక్రయిస్తున్నారు. ఏజెన్సీలో మార్కెటింగ్ సదుపాయం పెద్దగా లేకపోయినప్పటికీ కుటుంబ సభ్యులు తినడానికి పెరటిలో రెండు, మూడు మొక్కలు పెంచుకోవడం మంచిదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏటా జూన్ నుంచి ఆగస్టు వరకు పండ్ల దిగుబడి వస్తుంది. గిరిజన ప్రాంతం బార్బడోస్ చెర్రీ సాగుకి అత్యంత అనుకూలం. పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న బార్బడోస్ చెర్రీ మొక్కలు విరగ్గాస్తున్నాయి. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి కాపుకొస్తాయి. గరిష్ఠంగా 30 సంవత్సరాల వరకు పండ్ల దిగుబడి వస్తుంది. గిరిజన ప్రాంతంలో అరుదైన స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్, అవకడో పంటలను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. సీజన్‌లో ఈ పండ్లను కొనుగోలు చేసుకునేందుకు మైదాన ప్రాంతాల నుంచి వర్తకులు వస్తున్నారు. బార్బడోస్ చెర్రీ సాగు రైతులు చేపడితే మార్కెటింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. మైదాన ప్రాంతాల సూపర్‌బజార్లకు సైతం ఎగుమతి చేసుకుని అధిక ధర పొందవచ్చు. బార్బడోస్ చెర్రీలు మనిషిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. ఈ పండ్లలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. విటమిన్-సి అధికంగా లభిస్తుంది. పలు రకాల ఖనిజాలు వుంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి మంచి ప్రయోజకరంగా ఉంటుంది. గర్భిణుల్లో శిశువు ఎదుగుదలకు దోహదపడుతుంది. ఏడాదికి ఒకసారి అయినా ఈ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది.

# చేనేతలకు వేతనాల పెంపు: మంత్రి సవిత

## ఆప్కో, లేపాక్షి పనితీరు మెరుగుకు ఐఐఎంతో ఒప్పందం

అమరావతి, (సందేశం టైమ్స్ జూన్ 15) : వేలాది మంది చేనేతలకు లబ్ధిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచే కీలక నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందని రాష్ట్ర బీసీ, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతి సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆప్కోకు ఉత్పత్తులను సరఫరా చేసే ప్రాథమిక చేనేత కార్మిక సహకార సంఘాల కింద పని చేసే నేత కార్మికులకు వేతనాలు, చార్జీల పెంపు వర్తిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం చేనేతలకు 50 సంవత్సరాలకే పింఛను ఇస్తామన్న హామీని నిలపెట్టకునేలా ప్రతి నెలా రూ.4 వేల చొప్పున 92,274 మంది నేతన్నలకు పింఛను అందజేస్తున్నామన్నారు. మర మగ్గాలకు 500 యూనిట్లు, చేతి మగ్గాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. నేత కార్మికులతో పాటు హస్తకళాకారుల ప్రతిభను వెలికి తీసే ఉద్దేశంతో నూతన డిజైన్ల కోసం పోటీలు నిర్వహించబోతున్నామని తెలిపారు. పలు కేటగిరీల్లో ఉత్తమ డిజైన్లను ఎంపిక చేసి విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆప్కో, లేపాక్షి పని తీరు మరింత మెరుగుపరచడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎం)తో ఒప్పందం చేసుకున్నామన్నారు. పీపీపీ విధానంలో ఇతర రాష్ట్రాల్లో లేపాక్షి షోరూమ్‌లను ఏర్పాటు చేయబోతున్నామని సవిత తెలిపారు.

# గద్దర్ ఫౌండేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు




(సందేశం టైమ్స్ జూన్ 15) : తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో గద్దర్ పేరు ఎంతో విశిష్టమైనది. ప్రజా ఉద్యమాల కోసం తన జీవితాన్ని అర్పించిన విప్లవ కవి, ప్రజాగాయకుడు గద్దర్ సేవలకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫౌండేషన్‌కు భారీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫౌండేషన్‌కు రూ.3 కోట్ల నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**గద్దర్ ఆశయాల పరిరక్షణకు ప్రభుత్వ కృషి**

తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పోషించిన పాత్ర అమూల్యమైనది. గద్దర్ భావజాలాన్ని పరిరక్షించడం, ఆయన ఆలోచనలు, సాంస్కృతిక ప్రభావంపై పరిశోధనలను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**గద్దర్ స్మారక చిహ్నం నిర్మాణానికి ముందస్తు చర్యలు**

ఈ నిధుల విడుదలకు ముందే రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ స్మారక చిహ్న నిర్మాణానికి హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో స్థలాన్ని కేటాయించింది. గద్దర్ స్ఫూర్తిని కొనసాగించే పరిశోధన కార్యక్రమాలు, ఆయన స్మారకార్థం చేపట్టే ప్రాజెక్టులు, గద్దర్ జయంతి వంటి కార్యక్రమాల నిర్వహణకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడనుంది. గద్దర్ రచించిన పాటలు, ఆయన చేసిన పోరాటాలు, అందించిన సృజనాత్మక సందేశాన్ని భవిష్యత్ తరాలకు చేరవేయాలనేది ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, అణగారిన వర్గాల హక్కుల కోసం గద్దర్ చేసిన నిరంతర పోరాటానికి గుర్తింపుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**సమానత్వానికి గద్దర్ పోరాటం**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ– తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక విభాగంలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైనది. తన పాటలు, ప్రసంగాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం రగిలించడంలో గద్దర్ ముందున్నారు. 2023 ఆగస్టులో ఆయన మరణం ఒక శకానికి ముగింపు పలికినప్పటికీ, గద్దర్ ఫౌండేషన్ ద్వారా ఆయన ప్రభావం కొనసాగుతోంది. ఇప్పటికే హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గద్దర్ స్మారక చిహ్నం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

**ఫౌండేషన్ కార్యాచరణలు విస్తృతం**

గద్దర్ ఫౌండేషన్‌కు ఈ మూడు కోట్ల రూపాయల కేటాయింపు ద్వారా ఆయన ప్రబోధించిన సమానత్వం, న్యాయం, సాంస్కృతిక వైభవం వంటి విలువలను పరిరక్షిం

# 18 నుంచి సీపీగెట్-2025 దరఖాస్తుల స్వీకరణ

## జూలై 17 తుది గడువు..

## ఆగస్టు మొదటి వారంలో పరీక్షలు




హైదరాబాద్ (సందేశం టైమ్స్ జూన్ 15): రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తు లను ఈ నెల 18 నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు.

**నోటిఫికేషన్ విడుదల**

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూని వర్సిటీ ఉప కులపతి(విసి) ప్రొఫెసర్ ఎం కుమార్ నోటిఫికేషన్ ను విడుదల చేశారు. ఈ కార్య క్రమంలో ఉన్నత విద్యామండలి వైస్చైర్మన్లు ప్రొఫె సర్ పురుషోత్తం, ఎస్కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ తోపాటు శాతవాహన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ యు ఉమేష్ కుమా ర్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూని వర్సిటీ ఇన్చార్జ్ విసి ప్రొఫెసర్ సూర్య ధనుం జయ్, సిపిజిఈటి-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి పాల్గొన్నారు. పిజి కోర్సులైన ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్లతోపాటు 5 సంవత్స రాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్లలో ప్రవే శానికి సీపీగెట్ పరీక్షను నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

**వివిధ యూనివర్సిటీల్లో ప్రవేశాలు**

రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యా లయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వ విద్యాలయం, తెలంగాణ విశ్వ విద్యాలయం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యా లయం, జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్టియుహెచ్) లో ప్రవేశాల కోసం సిపిజెట్ను నిర్వహించ నున్నారు.

**18 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

ఈ నెల 18 నుంచి ఆన్లైన్లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. జులై 17 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 500 అపరాధ రుసుంతో జులై 24 వరకు, రూ. 2000తో జులై 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 297 కాలేజీల్లో సుమారు 50వేల సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మొత్తం 51 సబ్జెక్టులలో 108 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పరీక్ష ఫీజు జనరల్ వారికి రూ. 800 కాగా ఎస్సీ, ఎస్టీలకు రూ. 600గా నిర్ణయిం చారు. అదనపు సబ్జెక్టుకి రూ. 450 చెల్లించాల్సి ఉ ం టుంది. గత ఏడాది 46,742 సీట్లు అందు బాటులో ఉండగా.. వాటిలో 21,560 సీట్లు భర్తీ అయినట్టు తెలిపారు. ఈ ఏడాది అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 4వేల సీట్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సుమారు 50వేల సీట్లలో ప్రవేశాలను చేపట్టను న్నారు. త్వరలోనే ఎర్రైన్స్ యూనివర్సిటీకి అనుమతి వస్తే అందులో కూడా అడ్మిషన్లను చేపట్టనున్నట్టు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.

# యువత క్రీడల్లో రాణించాలి.. ఎమ్మెల్యే వేముల వీరేశం



(సందేశం టైమ్స్ జూన్ 15) :నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం యువతకు పిలుపునిచ్చారు. యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కట్టంగూర్ మండల కేంద్రంలో జిల్లా స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఆయన, క్రీడలు శారీరకంగా మాత్రమే కాకుండా మానసిక దృఢత్వానికి కూడా దోహదపడతాయని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు.

**గ్రామీణ యువతకు పెద్దస్థాయిలో అవకాశాలు**

గ్రామీణ ప్రాంతాల నుంచి ఎన్నో ప్రతిభావంతులైన క్రీడాకారులు వచ్చి జాతీయ స్థాయిలో ఎదిగే అవకాశాలు ఉండాలన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలనే భావనను అభివృద్ధి చేసుకోవాలని, ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ద్వారా అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ స్థాయిలో ఇటువంటి టోర్నమెంట్‌లు మరింతగా నిర్వహించాలని కోరారు.

**క్రీడాభివృద్ధికి శ్రద్ధ**

క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. జిల్లా స్థాయిలో టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం క్రీడల పట్ల యువతలో ఆసక్తి పెంపొందించడంతో పాటు, గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించే దిశగా మంచి ప్రయోజనాలు అందిస్తుందన్నది ప్రజల అభిప్రాయం.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక ఎన్నికలకు వెళ్తే ఊరుకోం.. రేవంత్ సర్కారుకు కవిత హెచ్చరిక



(సందేశం టైమ్స్ జూన్ 15) : బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలు చేశారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫొటో విడుదల చేసిందని.. ఆ ఫొటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడుతున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ.8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006